

# శాంతకుడి పెరటి చెట్టు

జె. రామలక్ష్మి

ఆ కథ నాకు చాలా నచ్చింది.

సాధారణ మధ్యతరగతి కుటుంబాల్లో నాగరికత ముసుగుచాటున, సంస్కారపు నీడల్లో పురుషుడు స్త్రీని ఎలా వేధిస్తున్నాడో చక్కగా వర్ణించింది రచయిత్రి.

అప్రయత్నంగా ఆవిడ పేరు చూసాను. రాయవరపు రమాప్రభ.

ఆయనచేత కూడా ఆ కథ చదివించాను. కథ చదివి సిగ్గుపడ్డారాయన.

"ఉమా! నువ్వీ కథ నాచేత


చదివించడానికి కారణం నా ప్రవర్తనే కదూ?" అనడిగారు.

"అబ్బే- అదేం కాదండీ!" అన్నాను. కానీ ఆయన మాటల్లో నిజముందేమో ననిపించింది.

మేము సుఖంగానే కాపురం చేసుకుంటున్నాం. మా కాపురంలో కలతలు లేవు. కానీ....

నేను పుట్టింటికి వెళ్ళడానికి ఆయన అనుమతి కావాలి. ఆయన పుట్టింటికి వెళ్ళడానికి నా అనుమతి అక్కర్లేదు.

ఆయన కాఫీ తాగుతారు. నేను తాగను. నలుగురిలోకి వెళ్ళినప్పుడు మర్యాదగా ఉండదని మందలించి బలవంతంగా నాకా అలవాటు చేశా



రాయన. ఇప్పటికీ నాకు కాఫీ నచ్చదు. కానీ ఆయన కోసం ఇంట్లో రోజుకొకసారి తాగుతాను. బయటకు వెళ్ళినప్పుడు తాగుతాను. ఆయన కారం తినరు. నాకు కారం ఇష్టం. కారం వంటికి ఆరోగ్యం కాదని ఇంట్లో ఏ పదార్థాల్లోనూ కారం వెయ్యనివ్వరు. ఆయన కోసం చప్పిడి కూరలు తింటున్నాను.

ఆయన అప్పుడప్పుడు విస్కీ పుచ్చుకుంటారు. బీరు సేవిస్తారు.

అవి మాత్రం ఆయనకే పరిమితం కావాలిట! ఆయనకులా నేను కాఫీ తాగాలి. ఆయనకులా నేను కారం తినకూడదు. కానీ విస్కీ విషయంలో మాత్రం ఆయనకులా ఉండకూడదు.

ఇవన్నీ నే నెప్పుడూ పెద్దగా పట్టించుకోలేదు. ఒక్కసారి కూడా వీటి గురించి ఆలోచించలేదు.

ఒకసారి అమ్మ జబ్బుపడి మనిషి సాయానికి నన్నొచ్చి ఓ నెల్లాళ్ళుండమని కోరింది. చుట్టపు చూపుగా వెళ్ళి చూసి వచ్చేశానే తప్ప అక్కడుండి సాయపడ్డానికి నాకు అనుమతి లభించలేదు. నన్ను వదిలి ఉండ లేనన్నారాయన. ఆ ప్రేమకే కరిగిపోయాను నేను. ఆ తర్వాత మా అత్తగారు ఎందుకో నన్ను పంపించమని రాశారు. నాకు వెళ్ళాలని లేదు. కానీ ఆయన బలవంతం మీదనే వెళ్లాను. ఆరు వారాలు ఆ విధంగా ఆయన్ను విడిచి వున్నాను.

ఇవన్నీ ఏవో మామూలు విశేషాలుగా తీసుకున్నాను.

రాయవరపు రమాప్రభ ఈ కథలో ఇటువంటి సంఘటనలనే తీసుకుంది. చివరలో "ఏ పురుషులను విమర్శించడం కోసం ఈ కథ రాయలేదు. వారు ఆత్మ విమర్శ చేసుకోడానికీ కథ ఉపయోగపడుతుందన్నదే నా ఆశ" అని కూడా రాసిందామె.

ఈ కథ చదివినప్పట్నించి వారిలో కొంత మార్పు వచ్చింది. ప్రతి విషయాన్నీ తీవ్రంగా ఆలోచించడం మొదలెట్టారు. ఫలితంగా నా కోసం నేను వేరే కారం కూరలు అప్పుడప్పుడైనా వండుకోగలుగుతున్నాను. కాఫీ పూర్తిగా మానేశాను. ఇంకా ఆశ్చర్యమేమిటంటే ఆయనే కాఫీ మానేయడానికి యత్నిస్తున్నారు.

అందుకు కారణం నాకు తెలుసు. రమాప్రభ తన కథలో భర్తలకొక సూటి ప్రశ్న వేసింది. "మీ భార్యలు మీ కోసం ఎన్నో త్యాగాలు చేయాలని మీరనుకుంటున్నారు. మీ భార్యకోసం మీరు ఒక్కటంటే ఒక్క త్యాగం చేయగలరా?"- ఈ ప్రశ్న గురించి శ్రీవారు నాతో చాలా పర్యాయాలు చర్చించారు.

"ఏం మానేయను ఉమా?" అనడిగారు వారు.

"మీరెప్పటిలాగే ఉండండీ! నాకేమీ బాధలేదు" అన్నాను.

కానీ రచయిత్రి ప్రభావం ఆయనపై చాలా ఎక్కువగా ఉంది. ఆయన ప్రస్తుతానికి కాఫీ రోజుకొక్క పర్యాయం మాత్రమే తాగు

తున్నారు.

పురుషులనంతగా ప్రభావితులా లని చేసిన ఆ రచయిత్రిపై నాకు ప్రత్యేకమైన గౌరవభావం కలిగింది. అప్పట్నించీ ఆమె రచనలు ఒక్కటీ వదలకుండా చదవసాగాను. నేనే కాదు- ఆయన కూడా చదువుతున్నారు.

"మా మగవాళ్ళ ఆలోచనల్ని సరైన దారిలో పెట్టడానికి లాంటి ఆడవాళ్ళు కావాలోయ్! నామటుకు నాకు ఈవిడ ఎనాలిసిస్ బాగా నచ్చుతోంది. ఆత్మ విమర్శకు పని కొస్తోంది" అన్నారాయన చాలా సార్లు.

ఇలా ఉండగా మా ఇంటి పక్కకో కొత్త కుటుంబం దిగింది. ఇంటాయనకో ముప్పై ఏళ్ళుంటాయి. భార్యకు పాతికేళ్ళు. ఇద్దరు పిల్లలున్నారావిడకు. ఇద్దరూ స్కూల్లో చదువుకుంటున్నారు.

మొగుడలా ఆఫీసుకు వెళ్ళగానే ఆవిడ మా ఇంటికి వచ్చేసేది పెత్తనాలకు. అయితే నా పనికి అడ్డంగా ఉండేది కాదావిడ. నన్ను పని చేసుకోనిస్తూనే కబుర్లు చెప్పేదావిడ. అప్పుడప్పుడు నాకు పనుల్లో సాయపడుతూండేది కూడా.

మొదటిరోజునే చనువుగా 'వదినగారూ!' అంటూ వరస కలిపిన ఆవిడ దగ్గర్నుంచి ఆడవాళ్ళు నేర్చుకోవలసిన విశేషాలు చాలా ఉన్నాయి.

ఆవిడ పెద్దగా చదువుకోలేదు. కానీ ఆవిడకు రాని వంట లేదు, పిండి వంటలేదు. అల్లికలు, కుట్టు పనుల్లో ఆవిడ ఆరితేరింది. ఎలాంటి వాళ్ళకైనా చలాకీగా కబుర్లు చెపుతుంది. ఇంట్లో ఎంత పనున్నా ఇట్టే తెమిలి పెత్తనాలకు బయల్దేరుతుంది. అప్పుడు కూడా ఉత్తినే కూర్చోకుండా ఏ స్వెట్టరో, క్రాస్‌స్టిచ్ డిజైనో కూడా తెచ్చుకుంటుంది.

ఆవిడ దగ్గర పాపం ఎరమరిక కూడాలేదు. కాస్త చనువైతే చాలు మనసు విప్పి మాట్లాడి తన రహస్యాలు కూడా చెప్పుకుంటుంది.

అప్పుడప్పుడు ఆవిడ తను చేసిన పులుసో, కూరో మా ఇంట్లో ఇస్తూండేది. అవి తిన్నాక వంటలో నేనెంత వెనబడ్డానో నాకు అర్థమైంది. అందుకే ఆవిడ కెప్పుడైనా నా వంటకాలివ్వాలంటే బెదురుగా వుండేది.

"ఆదర్శ మహిళ మీరు. మీ వారు అదృష్టవంతులు" అన్నాను నేను.

అంతే!

ఆవిడ కళ్ళనీళ్ళు పెట్టుకుని-

ఈ అదృష్టం మీ బోటిగాళ్ళు గుర్తించాల్సిందే తప్ప ఆయనకు కనబడదు" అది.

నాకు అర్థం కాలేదు. "అలా గంటారేమిటి వదినా?" అన్నాను.

"అదో తత్వం ఆయనది. ఆడవాళ్ళు వంటిల్లు దాటకూడదంటారు. ఇప్పుడు సమాజానికి దాపురించిన అరిష్టాలన్నీ ఆడదానికి స్వేచ్ఛ ఇవ్వడం వల్లనే వచ్చాయంటారు. నేనేం చేసినా ఆయనకు నచ్చదు. వంటకాలన్నింటికీ వంక పెడతారు. రుచిగా వండితే దుబారా చేస్తున్నానంటారు. రుచిగా లేకపోతే సంపాదించేదెందుకూ అంటారు. నా జాకెట్లు నేనే కుట్టుకుంటే-అందమైన గుడ్డ పాడు చేశానంటారు. పోనీ అవి బైట కుట్టడానికిస్తే ఇంట్లో మిషనున్నదెందుకూ అంటారు. పిల్లల విషయంలోనూ అంతే! వాళ్ళను కసిరినా, మెచ్చుకున్నా ఆయనే చేయాలి. నేనేం చేసినా తప్పే! అందువల్ల పిల్లలకు కూడా నేనంటే లక్ష్యం లేకుండా పోయింది" అందావిడ ఇంకా కళ్ళ నీళ్ళు అలాగే ఒత్తుకుంటూ.

నేను చలించిపోయాను. అంత మంచి ఇల్లాలి కెటువంటి భర్త దొరికాడు?

అప్పుడు నేను నా అదృష్టాన్ని కూడా గుర్తించాను. రాత్రి ఆయనకు ఆవిడ భర్త గురించి చెప్పగా విని ఆయన నిట్టూర్చి- "చాలామంది మగాళ్ళీ రోజుల్లో ఇలాగే ఉంటున్నారోయ్! ఒక్కసారి ఆయన చేత కూడా ఆ రమాప్రభగారి కథలు చదివించమని చెప్పు-ఒకోసారి పని చేయవచ్చు" అన్నారు.

రాయవరపు రమాప్రభ మరీ అంత పాప్యులర్ రచయిత్రి కాదు. ఒక ఏడాది పాటు నేను కలెక్ట్ చేసినని ఆరేడు కథలున్నాయి. అయితే ఆ ఆరేడు కథలూ కూడా ఆణిముత్యాలు.

మర్నాడావిడ మా ఇంటి కొచ్చినపుడు-"మీకు రాయవరపు రమాప్రభ అనే పేరు తెలుసా?" అనడిగాను.

ఆవిడ ఆశ్చర్యంగా-"నా పేరు మీకెలా తెలుసు?" అంది.

షాక్ తిన్నాను. "మీరేనా రచయిత్రి రమాప్రభ!"

ఆవిడ క్షణం మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా-"ఎందుకలా అడిగారు?"

నేను లోపలకు వెళ్ళి ఆవిడ కథలున్న ఆరేడు వార మాస పత్రికలు తీసుకు వచ్చి ఆవిడ ముందు పెట్టి-"నేనూ, మా వారు కూడా

మీ అభిమానులం" అన్నాను.

"అలాగా!" అందావిడ నిరుత్సాహంగా.

"మీ కథలు మా వారిలో మంచి మార్పును తీసుకొచ్చాయి" అంటూ ఉత్సాహంగా మా ఇంట్లో అనుభవాలన్నింటినీ ఆవిడకు చెప్పాను.

"మీరే ఆ కథారచయిత్రి అని తెలియక, ఈ కథలు మీ వారి చేత చదివించమని మా వారు మీకు చెప్పమని సలహా కూడా ఇచ్చారు. ఇంతకూ మీరు రచయిత్రి అన్న విషయం మీ వారికి తెలుసా?" అనడిగాను.

"ఆ విషయం తర్వాత చెబుతాను. నా కథలకు కథా వస్తువు ఎక్కడ దొరుకుతోందంటారు?" అందావిడ నావంక అదోలా చూస్తూ.

నేను కాసేపు ఆలోచించి, "అర్థమైంది. మీ ఇంట్లో మీకెదురౌతున్న సమస్యలన్నిటినీ మీరు కథలుగా మార్చి రాస్తున్నారు" అన్నాను నేను.

"ఎందరో పురుషులపై ప్రభావం చూపించిన ఆ కథలు మా వారినెందుకు మార్చడం లేదంటారు?"

"పెరటిచెట్టు వైద్యానికి పనికి రాదంటారు. అంతేనంటారా?" అన్నాను నేను నవ్వుతూ.

ఆవిడ కూడా నవ్వి, "ఒక హత్య జరిగిందనుకోండి. ఆ హత్య ఎలా జరిగిందో నేర పరిశోధకుడి కంటే బాగా చెప్పగలిగిన వాడెవడు?" అంది.

"హంతకుడు" అన్నాను అప్రయత్నంగా.

"రాయవరపు రమాప్రభ రచనలు అంత రసవత్తరంగా ఉండడానికీ, నా భర్తపై ఆ రచనల ప్రభావం ఏమీ లేకపోవడానికీ కూడా మీరన్నట్లు అవి పెరటిచెట్లు కావడమే కారణం."

"అది సరే! మీరు హత్య, హంతకుడు ప్రసక్తి ఎందుకు తీసుకొచ్చారు? మీ కథలు హంతకుడి చేత కాక హతుడి చేత చెప్పబడుతున్నాయి. అందుకే అవి ఇంకా రసవత్తరంగా ఉంటున్నాయి" అన్నాను.

"ఎంత వెర్రి వారండీ మీరు? హతుడు మాట్లాడటమన్నది వాస్తవంలో జరుగుతుందా?" అని ఒక్క క్షణం ఆగి, "ఇక మీరెన్నడూ నా వద్ద రచనల ప్రసక్తి తీసుకు రానంటే ఒక నిజం చెప్పేస్తాను...." అందావిడ.

"చెప్పండి!" అన్నాను కుతూహలంగా.

"రాయవరపు రమాప్రభ అన్నది నా పేరు మాత్రమే కాదు- ఆయన కలం పేరు కూడా!" అందావిడ. నాకు నోట మాట రాలేదు. *